

విజయవాడ – గుంటూరు రహదారిపై కిలోమీటర్లమేర నిలిచిపోయిన వేలాది వాహనాలు

# ‘గర్జన’కు గండి యత్నాలు!

- సహకరించని సర్కారు
- పలు చోట్ల లైసెన్సులు జప్తు
- ఎక్కడి వాహనాలు అక్కడే
- 100 కిలోమీటర్ల మేర తీవ్ర రద్దీ

హైదరాబాద్, గుంటూరు, పెదకాకాని, తాడేపల్లి, విజయవాడ, న్యూస్‌టుడే: తెదేపా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన యువగర్జన సభ విజయవంతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం తనవంతు ప్రయత్నాలు చేసినట్లు కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు ఈ గర్జనకు తరలివస్తారని ముందునుంచే భావించినా.. అందుకు తగ్గ ఏర్పాట్లు చేయడంలో సర్కారు ఘోరంగా విఫలమైంది. అసలు సభకే రాకుండా చేసేందుకు పలుచోట్ల వాహనాల లైసెన్స్‌లను, డ్రైవింగ్ లైసెన్సులను ఆర్టీఏ అధికారులు లాగేసుకున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు తగిన సంఖ్యలో పోలీసులను కేటాయించలేదు. ప్రణాళిక రూపకల్పన దగ్గర నుంచి దాన్ని అమలు చేయడం వరకు అన్ని స్థాయిల్లోనూ యంత్రాంగం విఫలమైంది. దీనికితోడు గర్జన జరుగుతున్న సమయంలో టీవీల్లో వీక్షించేందుకు లక్షలాది జనం సమాయత్తమవగా.. పలు ప్రాంతాల్లో ఆ సమయంలో విద్యుత్ కోత విధించారు. మొత్తంమ్మీద గర్జన విజయవంతం కాకుండా చూసేందుకు సర్కారు తన వంతు ప్రయత్నాలు చేసినట్లు కనిపించింది. తెదేపా శ్రేణులు, నందమూరి అభిమానులు లక్షలాదిగా పోటెత్తడంతో జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. కృష్ణా జిల్లా గన్నవరం నుంచి గుంటూరు జిల్లా చిలకలూరిపేట వరకు సుమారు 100 కి.మీ. మేర ట్రాఫిక్ స్తంభించింది. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి లక్షలాదిగా కార్యకర్తలు తరలివస్తున్నారని తెలిసినా.. ట్రాఫిక్ నియంత్రణకు తగు సంఖ్యలో పోలీసులను కేటాయించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. తత్ఫలితంగా వేలాది మంది అభిమానులు సభా ప్రాంగణానికి చేరుకోకుండానే వెనుదిరిగారు. హైదరాబాద్, విశాఖపట్నం వంటి ప్రాంతాల నుంచి విజయవాడ చేరుకున్న వాహనాలు బుధవారం ఉదయం నగరం నుంచి ర్యాలీగా తరలివెళ్లాయి. ముఖ్యంగా విజయవాడ శివార్లలోని తొమ్మిది, ఐదో నంబరు జాతీయ రహదారులపై వాహనాలు బారులు తీరాయి. బందోబస్తుకు 2,300 మంది పోలీసులను కేటాయించారు. వీరు లక్షలాదిగా పోటెత్తిన జనసందోహాన్ని నియంత్రించలేకపోయారు. పరిస్థితిని గమనించిన జిల్లా ఎస్పీ మహేష్‌చంద్ర లడ్హా, ఓఎస్డీ ఎం.రవిప్రకాష్ స్వయంగా రంగంలోకి దిగి తగు సూచనలిచ్చినా.. మధ్యాహ్నానికి పరిస్థితి మళ్లీ అదుపు తప్పింది. అన్ని దారుల్లో ట్రాఫిక్ స్తంభించిపోవడంతో వాటిని ఎటు మళ్లించాలో తెలియక పోలీసులు చేతులెత్తేశారు.

**చంద్రబాబుకూ తప్పని ఇక్కట్లు:** తెదేపా అధినేత చంద్రబాబు కాన్వాయ్‌కు ట్రాఫిక్ చిక్కులు తప్పలేదు. యువగర్జన సభ ముగిసిన అనంతరం చంద్రబాబు, బాలకృష్ణ, హరికృష్ణలు ఒకే కారులో బుధవారం రాత్రి సుమారు 7.50 నిమిషాలకు ప్రాంగణం నుంచి బయలుదేరారు. వారివెనక కల్యాణ్‌రామ్, తారకరత్నల కార్లు, పొలిట్‌బ్యూరో సభ్యులు, ఇతర ముఖ్యవాహనాలన్నీ బయలుదేరాయి. ప్రాంగణం పక్కనే వీఐపీల వాహనాలకు కేటాయించిన రహదారి అప్పటికే కిక్కిరిసిపోయింది. చంద్రబాబు కాన్వాయ్‌ను ముందుకు పంపడానికి పోలీసులు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ప్రాంగణం నుంచి కేవలం పావుకిలోమీటరు కూడా లేని జాతీయ రహదారిపైకి కాన్వాయ్‌ను తీసుకురావడానికి పోలీసులకు సుమారు 50 నిమిషాల సమయం పట్టింది. జడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న మాజీ ముఖ్యమంత్రి కాన్వాయ్ సైతం సాఫీగా వెళ్లే పరిస్థితి లేదంటే ట్రాఫిక్ నియంత్రణ పట్ల పోలీసులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించారో అర్థం చేసుకోవచ్చని తెదేపా నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.